క్లుప్తంగా

ఈఓపీఆర్డీగా తిరుపాల్



తుగ్గలి: మండల ఈఓపీఆర్డీగా టి.తిరుపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఈఓపీఆర్డీ వీరరాజు ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో డీపీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ తిరుపాల్‌ను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు.

వలసలు వద్దు.. ఉపాధి కల్పిస్తాం

తుగ్గలి: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని కూలీలు వలస వెళ్లొద్దని ఏపీఓ రామకృష్ణ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఎంఎస్ఆర్‌జీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా గ్రామాల్లో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ముందస్తుగానే అడిగిన వారందరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే మండలంలో ఉపాధి పనులు గుర్తించినట్లు చెప్పారు. వలసలు వెళ్లకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేట్లు ఉపాధి పనుల కల్పనపై వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సురక్ష శిబిరానికి విశేష స్పందన



చిన్నమరివీడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డాక్టర్ కార్తీక్ తెలిపారు. మంగళవారం చిన్నమరివీడు గ్రామంలో సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యులు రుక్సానా, సింధూర 380 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే అవసరమైన వారికీ కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. సర్పంచ్ శిరోమనెమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, ఎంపీహెచ్‌ఈఓలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పైర్లను పరిశీలిస్తున్న కేంద్ర గణాంక శాఖ అధికారి సాంబశివుడు

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వివిధ పంటల వస్తవ సమాచారం, పైర్ల ఎదుగుదల, దిగుబడి తదితర సమగ్ర సమాచారంతో నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు జిల్లా కేంద్రం గణాంక శాఖ అధికారి వై.సాంబశివుడు పేర్కొన్నారు. ఆయన మంగళవారం హాలహర్వి మండలం చింతకుంట, కామినహాల్ వివిధ గ్రామాల్లోని ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు ఆశించిన స్థాయిలో దిగుబడులు చేతికందే పరిస్థితి లేదన్నారు. ఈ ఏడాది తగినంతగా వర్షాలు కురువకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. తహసీల్దార్ మల్లికార్జున స్వామి, వీఆర్వో లింగప్ప, ఎంపీఈఓ రవిశేఖర్, వీఏఓలు ఎర్రిస్వామి, ఉమాకాంత్, మల్లికార్జున, ఈరప్ప, తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న పోలీసులు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం మొలగవల్లి గ్రామంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారన్నారు. గ్రామానికి చెందిన బోయ రామాంజి ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ చేసుకుని విక్రయిస్తుండగా పట్టుకుని 3 బాక్సుల (90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు) మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

హొళగుంద: కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం ప్యాకెట్లను తీసుకొచ్చి విక్రయిస్తున్న హెబ్బటం గ్రామానికి చెందిన లక్ష్మన్నను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడి నుంచి 72 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రానికి భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలు అభ్యున్నతి చెందుతున్నాయని, సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించుకోవాలని ఇందుకు పార్టీ శ్రేణులు, గృహసారథులు, కన్వీనర్లు సైన్యంలా పనిచేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి 'మా నమ్మకం నువ్వే జగన్' బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు లక్షలాది సచివాలయ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి ఇంటివద్దకే అందిస్తూ దేశంలోనే ఆదర్శ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్య, సంక్షేమం, అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తీర్చేందుకు రూ.500 కోట్లతో తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రోడ్లు, జగనన్న కాలనీలు, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధితో పాటు వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, ఆదోని సమీపంలో మెడికల్ కళాశాల ఏర్పాటు లాంటి ప్రజా ఉపయోగ పనులను ప్రభుత్వం చేపడుతుందని వివరించారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు ప్రతి గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనను, గత టీడీపీ పాలనకు మధ్య తేడాను వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు. 9వ తేదీ నుంచి చేపట్టనున్న 'మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన మోసాన్ని వివరించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు ప్రసంగించగా వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు బీఆర్ బసిరెడ్డి, బుట్టారంగయ్య, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీపీ కేశన్న, పార్టీ నాయకులు రియాజ్‌అహమ్మద్, భీమిరెడ్డి, పోలయ్య, యుకె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ ప్రారంభం

గోనెగండ్ల: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో సచివాలయం రూ.40 లక్షలు, ఆర్బీకే రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్ రూ.17.50 లక్షలతో నిర్మించిన భవనాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి జలజీవన్ మిషన్‌కింద రూ.80 కోట్లు మంజూరయ్యాయని, బి.అగ్రహారం గ్రామానికి రూ.60 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆ నిధులతో గ్రామంలో ట్యాంక్ నిర్మాణం చేపట్టి, హంద్రీ నది ఒడ్డున బోర్లు వేసి పైప్‌లైన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే అలువాల గ్రామం నుంచి బెళగల్, అయ్యకొండ నుంచి కడిమెట్ల వరకు రోడ్డు మంజూరైందని టెండర్లు పూర్తికాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పల్లెల్లో సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందన్నారు.



బి.అగ్రహారంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

రైతు భరోసా కేంద్రాలతో రైతులకు విస్తృత సేవలు, హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు గ్రామాల్లోనే వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదని, ప్రజా సంక్షేమం గురించి పట్టించుకున్న పపాన పోలేదని విమర్శించారు. అనంతరం ఆర్బీకేలో కియోస్క్ మిషన్‌ను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, ఎంపీటీసీ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై పట్టు పెంచుకోవాలి

గోనెగండ్ల: విద్యార్థులలో సైన్స్‌పై అభిరుచి పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని ఎంఈఓ రామాంజినేయులు అన్నారు. మంగళవారం గోనెగండ్ల ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించడం జరుగుతుందని, అలాగే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డీఈఓ అనుమతితో సైన్స్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 10న మండల స్థాయి, నవంబర్ 30న జిల్లాస్థాయి, డిసెంబర్ 17న రాష్ట్రస్థాయి అలాగే జనవరి 27, 28 తేదీలలో ఫైనల్ టెస్టు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఎంఈఓ-2 నీలకంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలిద్దాం

హొళగుంద: ఇంకా పల్లెల్లో కొనసాగుతున్న అంటరానితనం, కుల వివక్షను శాశ్వతంగా నిర్మూలిద్దామని అందుకు విద్యావంతులైతేనే సాధ్యమని హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, తహసీల్దారు హుసేన్‌సాహెబ్ అన్నారు. బుధవారం నెరణికి గ్రామంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునికత వైపు అడుగులు వేస్తున్న కాలంలో అంటరానితనం, అస్పృశ్యత, వివక్షత, రెండు గ్లాసుల పద్ధతి ఉండకూడదన్నారు. కులాల పట్టింపులకు వెళ్లకుండ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా గ్రామపెద్దల మధ్య పరిష్కరించుకోవాలని సూచించారు. దళితులు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎస్ఐ సూచించారు. వీఆర్ఓ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల తనిఖీ

దేవనకొండ: దేవనకొండ, కుంకనూరు గ్రామాల్లోని మీ సేవ కేంద్రాలను మంగళవారం కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి బాలకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మీ సేవ కేంద్రాలు, వాటి నిర్వహణ, రిజిస్టర్లు, రిసిప్ట్‌ల నిర్వహణ, ప్రజల నుంచి తీసుకునే చార్జీలు, సెంటర్‌లో జగనన్నకు చెబుదాం పోస్టర్, సిటిజన్ చార్టర్, రేట్స్, మీ సేవ లోగో, నేమ్ బోర్డు ప్రజలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతంలో నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయంలో చేయూత దరఖాస్తులు, సర్వీసులు, కన్సిస్టెంట్ రిథం యాప్‌లో హాస్టల్స్, స్కూల్స్ తనిఖీ, అంగన్‌వాడీల తనిఖీ సంబంధించి వాటిపై చర్చించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని మాచాపురం, దేవనకొండలోని సచివాలయాలను తనిఖీ చేశారు.



తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి బాలకృష్ణారెడ్డి

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. 21వ వార్డు పరిధిలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా హాస్పటల్ వెనుక ఖాళీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.490 లక్షలతో టెక్నికల్ అప్రూవల్ లభించడంతో అడ్మినిస్ట్రేషన్ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు చైర్మన్ ముందస్తు చర్యను ర్యాటిఫై చేసేలా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా ఎల్లెల్సీ నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచుకునేందుకు క్రాస్ బండ్ నిర్మాణానికి రూ.4.50 లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం ప్రకటించింది. అజెండాలోని 33 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రకటించడంతో సభ్యులు అందుకు సమ్మతించి తీర్మానించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఆర్ఓ బేబి, మేనేజర్ వరప్రసాద్, ఏఈలు శరత్‌చంద్ర, మదన్, వైస్ చైర్మన్లు దివ్యకళ, కో-ఆప్షన్ మెంబర్ అబ్రార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ వాసులకు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్ రెడ్డి, జీఆర్‌పీ ఈఈ మురళీ పులికనుమ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని ఎల్లెల్సీ ద్వారా ఎమ్మిగనూరులోని గుడికల్ చెరువుకు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు మళ్లించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీరు ఎమ్మిగనూరు పట్టణానికి వేసవిలో సైతం ఉపయోగపడేలా నిల్వ చేసుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. పట్టణ వాసులకు నీటి కష్టాలు తలెత్తకుండా పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.



పులికనుమ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, జీఆర్‌పీ ఈఈ

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

హొళగుంద: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై నిఘా ఉంటుందని చెప్పారు. ప్రతి ఆదివారం పోలీసుస్టేషన్‌కు రావాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. నాటుసారా, మద్యం అమ్మకాలు ఇతర అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి పనులు చేసుకుంటూ పిల్లలను బాగా చదివించాలన్నారు.

'సురక్ష'తో పేదలకు మెరుగైన వైద్యం



రోగులకు మందుల కిట్ అందజేస్తున్న దృశ్యం



నల్లచెలిమలలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హొళగుంద: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు అన్నారు. బుధవారం మార్లమడికి సర్పంచ్ హరిజన యంకప్ప, పంచాయతీ సెక్రటరీ షఫి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, రాధ, కర్నూలు జనరల్ సర్జన్ సాయికల్యాణ్, కంటి వైద్యులు చంద్రశేఖర్, ఆదోని మధు హాస్పిటల్ డాక్టర్ లక్ష్మికాంత్‌రెడ్డి ప్రజలకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ లాంటి సాధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల జబ్బులున్న వారిని పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు చెప్పి ఉచితంగా మందుల కిట్లను అందించారు. శిబిరంలో 358 మందిని పరీక్షించగా అందులో 28 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, చంద్రశేఖర్, బీరప్ప, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈఓపిఆర్డీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు ప్రవీణ్‌కుమార్, ఎస్.కె.రసూల్, జావేద్, హరిత సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని నల్లచెలిమల గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 350 మందికి పైగా రోగులు వైద్య చికిత్సలు చేయించుకున్నట్లు చెప్పారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల గురించి ఆరా తీసి, వారికి కర్నూలు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తామని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కృష్ణగిరి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని కంబాలపాడు ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగం హైజంప్‌లో గిరిశేఖర్, డిస్కస్ త్రోలో వెంకటేశ్వర్లు, కబడ్డీలో సాయిచరణ్, ఫుట్‌బాల్‌లో మనోహర్, బాల్ బ్యాడ్మింటన్‌లో నితీష్‌కుమార్, ఖోఖోలో మధుసూదన్‌నాయుడు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-17 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో విశాల్, 400 మీటర్ల హర్డిల్స్‌లో హరివర్ధన్ రాణించి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్యను హెచ్ఎం, పీఎంసీ చైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

తుగ్గలి: మండలపరిధిలోని రాతన సమీపంలో ఉన్న ఆశ్రమ బాలికల పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంగళవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జ్ డీటీడబ్ల్యూఓ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి మెనూపై ఆరా తీశారు. విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశా రు. హెచ్ఎంలు రామయ్య, మునిశేలయ్య పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

మద్దికెర: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రంగస్వామి, ఎంఈఓ-2 గోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యార్థులకు చదువులో రాణించడంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.వారుమాట్లాడుతూ..మండలంలోని ఆయా గ్రామాలలో 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు గణితం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థుల విద్యా నైపుణ్యాలను అంచనా వేయడం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు ఏ మేరకు పాఠ్యాంశాలు బోధించాలో తగిన చర్యలు చేపడతామని వెల్లడించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ఆలూరు రూరల్: ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు బీఎల్‌ఓల ద్వారా సంబంధిత ఫారాలు అందించాలన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. జనవరి 5వ తేదీ తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం, వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్ల 2వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అందించిన పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇప్పటి వరకూ రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు అందాయని వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. పొద్దు పొడవక ముందే పెన్షన్లను ఇంటి వద్దే అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ నాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, బందెనవాజ్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, ఉమాదనంద రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 14వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మిగనూరులోని అన్ని వార్డుల పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్ ఖాశీంబేగ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో దశల వారీగా మంచినీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, నాయకులు రియాజ్ అహ్మద్, బుట్టారంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై స్పెషల్ డ్రైవ్

పత్తికొండటౌన్: సవరించిన ఓటరు జాబితా ముసాయిదా డ్రాఫ్ట్-2024పై మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 6వ తేదీ నుంచి 3 రోజుల పాటు అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించే 3 రోజులపాటు బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలకు సంబంధించి ఫారం-6, 7, 8 దరఖాస్తులను అందజేయాలన్నారు. ఒకే ఓటరు రెండు పోలింగ్ కేంద్రాలలో నమోదైన వాటిని గుర్తించి బోగస్ ఓట్లను తొలగించేందుకు సహకరించాలని కోరారు. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన జీవరాళ్లమల తండాలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 14 చోట్ల పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డీఓ తెలిపారు. తహసీల్దార్లు విష్ణుప్రసాద్, నాగభూషణం, రవి, రాజేశ్వరి, శివరాముడు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి

బాల్య వివాహాలను అరికట్టాలి

గోనెగండ్ల: బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని ఎంఈఓ రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాల్య వివాహాలను నిర్మూలించాలని, ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలని కోరారు. బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాల గురించి వివరించారు.

లారీ బోల్తా

ఆలూరు రూరల్: మండలంలోని కురువళ్లి గ్రామ బస్టాండ్ వద్ద హైవే 167 నందు మంగళవారం మధ్యాహ్నం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం జిందాల్ నుంచి సిమెంట్ తయారీ ముడి సరుకుతో ఆంధ్రప్రదేశ్ వైపు వస్తున్న లారీ నంబర్ కేఏ 51 ఏఈ 7614 అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. గ్రామస్తులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఏఎస్ఐ తిరుపాల్‌నాయక్ విలేకరులకు తెలిపారు.



కురువళ్లి వద్ద బోల్తా పడిన లారీ

బంకు తొలగింపు

గోనెగండ్ల: మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో ఎమ్మిగనూరు - తెర్నేకల్ రోడ్డు స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బంకును అధికారులు మంగళవారం తొలగించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు స్థలంలో బంకును ఏర్పాటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో మంగళవారం గ్రామానికి వెళ్లి బంకును తొలగించినట్లు చెప్పారు. ఎవరైనా రోడ్డు స్థలం ఆక్రమించుకుని బంకులు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు వర్గాల ఘర్షణ

హొళగుంద: వందవాగిలి గ్రామంలో రెండు వర్గాలకు చెందిన 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా ఘర్షణ ఏర్పడడంతో ఇరువర్గాల వారు కర్రలు, రాళ్లతో దాడులు చేసుకోవడంతో 9 మందికి రక్త గాయాలయ్యాయి. ఘటనలో వీరేశ్ వర్గానికి చెందిన ఏడుగురు, గోపాల్ వర్గానికి చెందిన తొమ్మిది మందితో కలిపి మొత్తం 16 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామ శివారులోని శివాలయం పక్కన పొలంలో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో వెల్దుర్తి మండలం బోయినపల్లికి చెందిన చింతమాను నాగశేషులు, రామళ్లకోటకు చెందిన పింజరి హుసేన్, నరసాపురానికి చెందిన షేక్ మహబూబ్‌బాషాలను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.9,070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.